ప్రజాశక్తి

సోమవారం 23 డిసెంబర్ 2024 5 శ్రీ సత్యసాయి

కాలిపోయిన పరీక్ష పేపర్లను పరిశీలిస్తున్న పోలీసులు

'పురం'లో ట్రాఫిక్ అస్తవ్యస్తం

- పేరుకే ట్రాఫిక్ స్టేషన్
- నియంత్రణలో సిబ్బంది విఫలం
- రహదారులపైనే వాహనాల పార్కింగ్

పరిగి రోడ్డులో ట్రాఫిక్ జామ్ అయిన దృశ్యం

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్య సాయి జిల్లాలోనే హిందూపురం అతి పెద్ద పట్టణం. దీంతో ప్రభుత్వం హిందూపురం పట్టణానికి ప్రత్యేక ట్రాఫిక్ స్టేషన్‌ను ఏర్పాటు చేసి, ఇద్దరు ఎస్ఐలు, మరో ఇద్దరు ఎఎస్ఐలతో పాటు హెడ్ కానిస్టేబుళ్లు,కానిస్టేబుల్, హోం గార్డులను నియమించింది. స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించిన వారికి నెలకు దాదాపు 1500 కేసులు వరకు నమోదు చేసి, రూ.1లక్ష వరకు జరిమానా విధిస్తున్నారు. ట్రాఫిక్ సిబ్బంది కేసులు నమోదులో చూపిస్తున్న శ్రద్ధ ట్రాఫిక్ నియంత్రిచడంతో చూపించడం లేదు. దీంతో అసలు పురంలో ట్రాఫిక్ స్టేషన్ ఉందా...లేదా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నిత్యం గాంధీ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, సబ్ రిజిస్టర్ కార్యాలయం ముందు ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ఉన్నప్పటికి ఎవరు పట్టించుకోవడం లేదు. వాహనదారులు ఇష్టానుసారంగా రావడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హిందూపురం పట్టణం అంటే వాణిజ్య పురం.హిందూపురం పురపాలక సంఘ జనాభా దాదాపు 1.90లక్షలు ఉంది. దాదాపు 50 వేల వరకు నివాసగృహాలు ఉన్నాయి. పట్టణంలో ప్రతి ఒక్కరు ఎదో ఒక వాహనాన్ని వినియోగిస్తున్నారు. విద్యార్థులు సైతం కళాశాలలకు వెళ్లాలంటే ద్విచక్రవాహనాలను వినియోగిస్తున్నారు. వీరితో పాటు చుట్టుపక్కల ఉన్నా వారు సైతం నిత్యం ఎదో ఒక పని మీద పట్టణానికి వస్తుంటారు. ఈ లెక్కల రోజుకు లక్షకు పైగా వాహనాల రాక పోకలు జరుగుతాయి. ఈ వాహనదారులందరు ట్రాఫిక్ నిబందనల మేరకు నడిచే విధంగా చూడాల్సిన ట్రాఫిక్ పోలీసులు ఆమేరకు చర్యలు తీసుకోవటం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. జరిమానాలు విధించడానికి ఇచ్చే ప్రాధాన్యత ట్రాఫిక్ నియంత్రణపై చూపడం లేదన్న ఆరోపణలు వినపడుతున్నాయి. గాంధీ సర్కిల్, డిఎల్ రోడ్డు, నట్ బజారు, మెయిన్ బజారులో భారీ వాహనాలు నిలబెట్టి లోడింగ్ అన్ లోడింగ్ చేస్తుంటారు. నిబందనల మేరకు భారీ వాహనాలు పగలు పట్టణంలోకి రాకూడదు. లోడింగ్ అన్ లోడింగ్‌కు చేస్తున్న వారిపై ట్రాఫిక్ సిబ్బంది చర్యలు తీసుకోవడం లేదు. ఇది చాలదన్నట్లు వాణిజ్య భవన సముదాయాల నిర్మాణ సమయంలో పార్కింగ్ కోసం స్థలాన్ని వదలకుండా భవన నిర్మానాలు చేపట్టారు. దీంతో వారి దుకాణాలకు వచ్చే వారందరు రహదారుల్లో వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. వందలాది మంది రియల్ఎస్టేట్ దళారులు వారి వాహనాలను సబ్ రిజిస్టర్ కార్యాలయం ముందు నిత్యం వందల సంఖ్యలో నిలుపుతున్నారు. దీంతో 50 అడుగుల రోడ్డు కాస్తా 30 అడుగులకు కుదించుకుపోతుంది. ఇప్పటికైనా పోలీసులు సబ్ రిజిస్టర్ కార్యాలయం ముందు, రహదారుల్లో వాహనాలు నిలపకుండా తగిన చర్యలు తీసుకోవడంతో పాటు పగటి సమయంలో లోడింగ్, అన్ లోడింగ్ జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలి. డిఎస్పి ప్రత్యేక చొరవ చూపి అస్తవ్యస్తంగా ఉన్నా పురం ట్రాఫిక్‌ను చక్కదిద్దే విధంగా చర్యలు తీసుకోవాలని పుర ప్రజలు కోరుతున్నారు.

రహదారిలో వాహనాల పార్కింగ్

పరీక్ష పేపర్లకు నిప్పు

ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

, స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయుల గదిలోకి శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చొరబడి విద్యార్థుల పరీక్షల జవాబు పేపర్లకు నిప్పు పెట్టారు. గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి గది తలుపునకు ఉన్న తాళాన్ని పగలగొట్టి లోపలికి చొరపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్పీ రత్న ఆదివారం ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడతూ గుర్తుతెలియని వ్యక్తులు తలుపు తాళాన్ని పగలగొట్టి లోపల బీరువాలోని ఎఫ్ఎ వన్, ఎఫ్ఎ టు విద్యార్థుల పరీక్షల జవాబు పత్రాలకు నిప్పు పెట్టారన్నారు. అయితే పాఠశాలకు సంబందించిన రికార్డులు భద్రంగా ఉన్నాయన్నారు. కేవలం విద్యార్థులకు సంబందించిన పరీక్ష జవాబు పత్రాలకు నిప్పుపెట్టడంతో అవి కాలి బూడిద అయ్యాయయన్నారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించామన్నారు. పాఠశాల హెచ్ఎం శోభారాణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ మల్లిఖార్జున తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వినోద్ కుమార్, క్రైమ్ బ్రాంచ్ సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, ఎంఇఒ సురేష్, పోలీసులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జాతీయ వినియోగదారుల హక్కుల పరిరక్షణపై ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ ఇనయతుల్లా ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆదివారం పుట్టపర్తి బస్టాండ్ లో ఆర్టీసీ ఉద్యోగులకు ప్రయాణికులకు హక్కులు, చట్టాలపై అధికారులు అవగాహన కల్పించారు. జిల్లా వినియోగదారుల అధ్యక్షులు కెఎస్ బాబాయ్, కార్యదర్శి మణిమాల, సివిల్ సప్లయ్ పోలీస్ అధికారి మధు వినియోగదారుల హక్కులు చట్టాలపై అవగాహన కల్పించారు. కొనుగోలు చేసిన వస్తువులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని దుకాణం యజమానిని అడిగి తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్, సెల్ ఫోన్‌లతో ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని వివిధ రకాలుగా మోసాలు జరుగుతున్నాయని తగు జాగ్రత్తలు తీసుకొని జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆర్టీసీ కార్గో వ్యవస్థను నెలకొల్పిందని ప్రయాణికులు వ్యాపారులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్గో వ్యవస్థ ద్వారా వస్తువులు డోర్ డెలివరీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, వ్యాపారులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలోని వశిష్ట పాఠశాలలో గణిత నమూనాలను ఆదివారం ప్రదర్శించారు. న్యాయనిర్ణేతగా గవర్నమెంట్ హై స్కూల్ కదిరి గణిత ఉపాధ్యాయుడు కె.నాగిరెడ్డి వ్యవహరించారు. ఈసందర్భంగా ఆయన నమూనాలను పరిశీలించి ఉత్తమమైన వాటికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పిట్టా శివశంకర్ రెడ్డి, ప్రిన్సినల్ పావని, వశిష్ట, గంగాధర్, మోహన్ రెడ్డి, మహేష్, సుప్రజ, నరేంద్ర వర్మ, సోమరాజు, భవాని, రమాదేవి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి, సవిత, తదితరులు

ప్రజాగొంతుక 'ప్రజాశక్తి'

క్యాలెండర్,డైరీ ఆవిష్కరణలో మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రజాశక్తి దినపత్రిక ప్రజాగొంతుక అని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజాశక్తి మేనేజర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో 2025 ప్రజాశక్తి క్యాలెండర్ డైరీలను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలుగు తీసి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న ప్రజాశక్తి పాత్ర అభినందనీయమన్నారు. ప్రజలకు అధికారులకు ప్రజాప్రతినిధులకు వారధిగా పనిచేస్తున్న ప్రజాశక్తి దినదినాభివృద్ధి చెందాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ శ్రీరాములు యాదవ్, మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, మాజీ సర్పంచి చంద్రకాంత్, నాయకులు త్రివేంద్ర, నంజప్ప , మావుటూరు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

క్రీడాదుస్తులు అందజేస్తున్న సామకోటి ఆదినారాయణ

క్రీడలతో మానసిక ఉల్లాసం పొందవచ్చని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ పేర్కొన్నారు. ఆదివారం పుట్టపర్తి ఆర్టీసీ డిపోలో ఉద్యోగులకు క్రికెట్ క్రీడకు అవసరమైన దుస్తులు, సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు పని ఒత్తిడితో మానసికంగా అలసిపోయి ఉంటారన్నారు. అలాంటి వారు విశ్రాంతి దొరికినప్పుడు క్రీడలపై ఆసక్తి కనబరచాలన్నారు. ఉద్యోగులు క్రీడల పట్ల ఆసక్తి చూపడం మంచి పరిణామం అన్నారు. తోటి ఉద్యోగులకు కూడా క్రీడల యొక్క ప్రాధాన్యత వివరించి వారిని కూడా వారికి నచ్చిన క్రీడలలో పాల్గొనడానికి ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయు జోనల్ అధ్యక్షులు షబ్బీర్, ఉద్యోగులు, డిపో కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణ సమీపంలోని సేవామందిర్ లోని ప్రశాంత మందిరం వృద్ధాశ్రమంలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బలరామిరెడ్డి, సామాజిక సేవకులు ఉమర్ ఫారూఖ్ ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని వృద్ధాశ్రమ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

నామమాత్రంగా సామాజిక తనిఖీ ప్రజావేదిక

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండలంలో 2023, 24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించి నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక తూతూమంత్రంగా కొనసాగింది. భారీగా అవినీతి జరిగినప్పటికీ కేవలం 80 వేల రూపాయలు అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం తేల్చిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివారం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయావరణంలో జరిగిన ప్రజా వేదికలో అధికారులు ఉపాధి పనుల నిర్వహణ వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని 12 గ్రామాలలో గ్రామీణ జాతీయ ఉపాధి పథకం ద్వారా రూ.9, 70, 81, 469ల విలువైన పనులు నిర్వహించారు.గత వారం రోజులుగా పంచాయతీ కేంద్రాలలో అధికారులు తూతూ మంత్రంగా గ్రామసభలు నిర్వహించారన్న విమర్శలు ఉన్నాయి. ఆదివారం మండల కేంద్రంలో పీడీ విజయప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీలలో కేవలం 8 వేల రూపాయలు అవినీతి జరిగినట్లు అధికారులు తేల్చి తక్షణ రికవరీ కోసం ఆదేశాలు జారీ చేయడం కొసమెరుపు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీడీ జ్యోతి, ఏపీవో శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల తనిఖీ

ప్రజాశక్తి-హిందూపురం

పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ ఆరతి, తూనికలు కొలతల శాఖ ఇన్స్‌పెక్టర్ శివశంకర్ సంయుక్తంగా ఆదివారం పట్టణంలోని పలు పెట్రోల్ బంకులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ నడిబడ్డున ఉన్న మణి పెట్రోల్ బంకులలో కొలతలను పరిశీలించడంతో పాటు పెట్రోల్, డీజిల్ నాణ్యతను పరిశీలించారు. వినియోగదారులకు ఖచ్చితమైన కొలతలతో నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందించాలని నిర్వాహకులకు సూచించారు. బంకులో వినియోగదారులకు అవసరమైన గాలి పంపు, తాగునీరు, టాయిలెట్స్ ఇతర సౌకర్యాలను అన్నివేళలా అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని చెప్పారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ పెట్రోలు కొలతల్లో మోసాలు జరుగుతున్నట్లు గత వారం నుంచి సామాజిక మాధ్యమాల్లో ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఆ ఫిర్యాదుల మేరకు తనిఖీలు చేపట్టామన్నారు. పెట్రోల్ బంకుల నిర్వాహకులు నిబంధనలను అతిక్రమించి, వినియోగదారులను మోసం చేయాలని చూస్తే బంకును సీజ్ చేయడంతో పాటు శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సౌకర్యాలు లేకపోయినప్పటికీ తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు.

'ప్రభుత్వం సహకరిస్తే వైద్యశాల ఏర్పాటు'

ప్రజాశక్తి-హిందూపురం

వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న పాంచజన్య శ్రీనివాసులు

ప్రభుత్వం సహకరించి స్థలాన్ని కేటాయిస్తే, ఆ స్థలంలో వైద్యశాలను ఏర్పాటు చేసి సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు పాంచజన్య శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పాంచజన్య పాఠశాల ఆవరణంలో పాంచజన్య భారతి శ్రీనివాస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వస్త్రవందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి పట్టణంతో పాటు లేపాక్షి, చిలుమత్తూరు మండలాల్లో నివాసముంటున్న 350 వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్ రమేష్ కుమార్, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ జెపికె రాము తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాంచజన్య శ్రీనివాసులు మాట్లాడుతూ తాను చేసే సేవా కార్యక్రమాల్లో తనవంతుగా తన అక్క భాగ్యలక్ష్మి అన్ని విధాల సహకారం అందించేది అన్నారు. ఆమె మృతిచెంది మూడు సంవత్సరాలు అయ్యిందని, ఆమెతో పాటు తన తల్లి తాయరమ్మ, అత్త జయలక్ష్మిల జ్ఞాపకార్థం 350 మంది వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశానన్నారు. దాతృత్వాన్ని మించిన సంపద లేదని అందుకోసమే తమ ట్రస్ట్ తరపున ఎన్నో సేవా కార్యక్రమాలను చేస్తున్నామని చెప్పారు. గతంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్యశాలను నిర్వహించేవారమని, అయితే కోవిడ్ నేపథ్యంలో తాత్కాలికంగా వైద్యశాలలో మూసివేశామని తెలిపారు. ప్రభుత్వం స్పందించి స్థలాన్ని కేటాయిస్తే ఆ స్థలంలో భవనాలను నిర్మాణం చేసి పూర్తిస్థాయిలో వైద్యశాలను ఏర్పాటు చేసి ఉచితంగా వైద్య సేవలు అందిస్తామన్నారు. రమేష్ కుమార్, జెపికె రాములు మాట్లాడుతు కొంత మంది మాత్రమే ప్రజలకు సేవలను అందించడానికి ముందుకు వస్తారు. అందులో పాంచజన్య శ్రీనివాసులు ఒక్కరని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు వేణుగోపాల్ మాట్లాడుతూ 'అందరూ బాగుండాలి అందులో నేను ఉండాలి' అనే సంకల్పంతో పాంచజన్య శ్రీనివాసులు ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు ఆదినారాయణ, నారాయణమూర్తి, పాఠశాల కరస్పాండెంట్ నందకుమార్, పాఠశాల సుపరింటెండెంట్ విజయేంద్ర, ఎఒ భాస్కర్, ఎహెచ్ఎంలు సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్ తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదర్శపంచాయతీలుగా తీర్చిదిద్దుతాం



జిల్లా పంచాయతీ అధికారి సమత

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలోని పంచాయతీలను అభివద్ధి పరచి వాటిని ఆదర్శ పంచాయతీలుగా తీర్చి దిద్దాలన్నదే తమ ధ్యేయమని, అందుకోసం అన్ని చర్యలు చేపడుతున్నామని శ్రీ సత్య సాయి జిల్లా పంచాయతీ అధికారి సమత పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : పంచాయతీ అభివృద్ధికి ఇటీవల నిధులు మంజూరు చేశారు. వాటి ద్వారా ఏయే పనులు నిర్వహిస్తున్నారు.?

జవాబు : శ్రీ సత్య సాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రధాన ద్వారం నుంచి మామిళ్ళకుంట వరకు, ప్రశాంతి రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాం. రహదారుల వెంబడి పిచ్చి మొక్కలు, వ్యర్థాలను తొలగించి, తాగునీటి వసతి వంటి పనులను చేపట్టాం. జిల్లా వ్యాప్తంగా ఆయా పంచాయతీల్లో సిసి రోడ్ల నిర్మాణం సాగుతోంది. వచ్చిన నిధులకు సరిపడా సీసీ రోడ్లు, డ్రయినేజీ పనులు ముమ్మురంగా సాగుతున్నాయి.

ప్ర : సంపద సృష్టి కేంద్రాల నిర్వహణ ఏ విధంగా ఉంది.?

జ: జిల్లా వ్యాప్తంగా సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్లు 421 ఉన్నాయి. కార్మికులు గ్రామంలో సేకరించిన తడి చెత్త పొడి చెత్తను వేరు చేసి, వాటిలో వానపాములను వదిలి ఎరువుగా తయారు చేసి ఆ ఎరువును రైతులకు కిలో 40 రూపాయలు చొప్పున విక్రయించి దాని ద్వారా పంచాయతీకి ఆదాయం వచ్చే విధంగా చర్యలు చేపడతారు. పంచాయతీలలో ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించడం, వీధులను శుభ్రం చేయడం వలన, పంచాయతీ పరిశుభ్రంగా ఉండటమే కాక , చెత్త ద్వారా సేకరించిన ప్లాస్టిక్ బాటిల్ ,ఇనుము ముక్కలు, సిల్వర్ తదితర వస్తువుల ద్వారా పంచాయతీలకు కొంత ఆదాయం లభిస్తుంది.

ప్ర : పంచాయతీ సెక్రటరీ గ్రేడ్ 5 ఉద్యోగుల వేతనాల సమస్యలపై మీ సమాధానం?

జ : పంచాయతీ సెక్రటరీల గ్రేడ్ 5 ఉద్యోగుల వేతనం సమస్య కొంతకాలం నుంచి నెలకొంది. ఈ సమస్య రెండు మూడు నెలల్లో పరిష్కారం కానుంది.

ప్ర : జిల్లావ్యాప్తంగా పంచాయతీల్లో ఏయే అభివృద్ధి పనులు చేపడుతున్నారు ? ఎంత నిధులు మంజూరు అయ్యాయి?

జ : శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ఉన్న పంచాయతీలలో డ్రైనేజీ, సిమెంట్ రోడ్లు, గ్రామంలో తాగునీటి సమస్య, వీధిలైట్లు ఏర్పాటు రోడ్ల మరమ్మతులకు మొదటి ప్రాధాన్యతను ఇస్తున్నాం. కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి పంచాయతీలకు 2024 -25 సంవత్సరానికి గాను 15వ ఆర్థిక నిధుల క్రింద జిల్లాకు రూ. 31.5 కోట్లు నిధులు ఆయా పంచాయతీల ఖాతాల్లోకి జమ కావడం జరిగింది. ఈ నిధుల ద్వారా పంచాయతీలలో అభివృద్ధి పనులను సక్రమంగా జరిగే విధంగా డిఎల్‌పిఒలకు, ఈవోఆర్డీలకు సూచనలు ఇచ్చాం.

ప్ర : జిల్లాలో సిబ్బంది కొరత పై మీ సమాధానం ?

జ : ఈవోఆర్డీలకు పంచాయతీ కార్యదర్శులకు ప్రమోషన్ల విషయంలో ఉన్నతాధికారుల నుండి త్వరలో ఉత్తర్వులు అందను న్నాయి. జిల్లా కేంద్రంలో సిబ్బంది కొరత ఉంది. డిపిఆర్‌సిలో నలుగురు ఆర్పీలు ఉండాలి. కానీ ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. జడ్పీ కార్యాలయం నుండి ఇద్దరిని నియమించగా వారు ఇంకా ఇక్కడికి రాలేదు. వారు ఇక్కడికి వచ్చిన తర్వాత అన్ని పనులు సవ్యంగా సాగుతాయి. ఎలాంటి పనులకు ఆటంకం లేకుండా ఉన్న సిబ్బందితోనే సర్దుకువెళుతున్నాం. ఇటీవల కొత్తగా జిల్లా కేంద్రానికి నియామకాలు జరిగాయి. వారు త్వరలో విధులు చేపట్టనున్నారు.

శ్రీసత్యసాయి జిల్లా డిపిఒ సమత

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

టిడిపి శ్రేణులకు మంత్రి, ఎంపీ పరామర్శ

ప్రజాశక్తి-గోరంట్ల

ఎంపి పార్థసారధి, మంత్రి సవితమ్మ ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల్లో వేర్వేరుగా పర్యటించారు. బూదిలి గ్రామంలో ఇటీవల ఓ ప్రమాదంలో గాయపడిన చాకలి సురేష్‌కు మంత్రి సవిత ఆర్థికసాయం అందజేశారు. వారు ముందుగా పాపిరెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీకాళభైరవేశ్వర ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎర్రబల్లి గ్రామంలో టిడిపి నాయకుడు సోమలింగారెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. మల్లాపల్లి గ్రామంలో రేషన్ డీలర్ శ్రీధర్ ఆత్మహత్యకు పాల్పగిన విషయం తెలిసి ఆ గ్రామం వెళ్లి శ్రీధర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్, హిందూపురం పార్లమెంటు కార్యదర్శి నరసింహులు, పచ్చ అశోక్, జిల్లా కార్యదర్శి వేణు రాయల్, సుబ్బారెడ్డి వెంకటరెడ్డి, భూపాల్‌రెడ్డి, బాలకృష్ణచౌదరి, మల్లాపల్లి మహమ్మద్ ఉన్నారు.

కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి

సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-మడకశిర రూరల్

రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని పార్లమెంటులో జరిగిన చర్చ సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా అంబేద్కర్‌ను కించపరిచే వ్యాఖ్యలు చేయడం తగదని సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి ట్విట్టర్ లో మండిపడ్డారు. అమిత్ షా వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేసి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

యుటిఎఫ్ మహాసభల గోడపత్రిక ఆవిష్కరిస్తున్న నాయకులు

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల గోడపత్రిక విడుదల

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

జనవరి 5, 6, 7, 8 తేదీల్లో కాకినాడలో నిర్వహించే యుటిఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి పిలుపినిచ్చారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తి కావడంతో స్వర్ణోత్సవాలు జరుపుకోవడం సంతోషదాయకం అన్నారు. కార్యక్రమంలో జోన్ నాయకులు రామకృష్ణనాయక్, లక్ష్మయ్య, ఆంజనేయులు, సకల చంద్రశేఖర్, పెద్దకోట్ల సురేష్, బిల్లే రామాంజనేయులు, ఎం.రాంప్రసాద్, ఎచ్.రామాంజనేయులు, ప్రదీప్‌కుమార్, సాయిగణేష్, తదితరులు పాల్గొన్నారు.


జనసేన పార్టీలో చేరిన గొట్లూరు గ్రామస్థులతో చిలకం

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు నచ్చి పలువురు వైసిపి నాయకులు ఆదివారం జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. మండలంలోని గొట్లురు గ్రామానికి చెందిన మండల ఉపాధ్యక్షులు గొట్లూరు జివి ఆధ్వర్యంలో వైసిపి సీనియర్ నాయకులు సాకే ఆంజనేయులు, బండి నాగేష్, బండి నాగార్జున, పూజారి హరి, బండారు నాగేష్, బండారు సోము, సురువు రవీంద్ర, ముప్పూరు చౌదయ్య, కంసల మణికంఠా చారి, బడిగే రాజేష్, సిద్ధలింగేశ్వర, తలారి రామాంజనేయులు జనసేనలో చేరారు. చిలకం మాట్లాడు తూ కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ఏ ఆపద వచ్చినా ముందుంటానని హామీ ఇచ్చారు.

కరాటేలో సాధించిన బెల్టులు, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

'శ్రీవిజ్ఞాన్' విద్యార్థుల కరాటే ప్రదర్శన

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

స్థానిక శ్రీవిజ్ఞాన్ సిబిఎస్ఈ పాఠశాలలో ఆదివారం 3 నుంచి 9వ తరగతి విద్యార్థులకు కరాటే మాస్టర్ షాకీర్ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కరస్పాండెంట్ మస్తాన్, హెచ్‌ఎం డాక్టర్ లత, వైస్ ప్రిన్సిపల్ ఫర్యాజ్, కోఆర్డినేటర్ సాధిక్ పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ చాటిన 32 మంది ఎల్లో, 15 మంఇ ఆరంజ్, ఒక విద్యార్థి బ్లూ బెల్ట్‌కి అర్హత సాధించారు. వారికి ముఖ్యఅతిథులు బెల్టులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల కోసమే ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఉచిత వైద్య శిబిరం నిర్వహించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని క్యాంపు ఛైర్మన్ దాసరి వెంకటేశులు(చిట్టి), అధ్యక్షులు బంధనాదం రమణ, కార్యదర్శి సిరివెళ్ల రాధాకృష్ణ, కోశాధికారి బండి నాగరాజు తెలిపారు. పట్టణంలోని తొగట వీధిలో వెలసిన శ్రీశాంతకళా చౌడేశ్వరీదేవి ఆలయ ఆవరణలో ఆదివారం శ్రీచౌడేశ్వరీదేవి ఆలయ అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో 106వ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దాసరి వెంకటేశులు మాట్లాడుతూ బద్దెల బాలమ్మ, వెంకటరామయ్య, వరలక్ష్మి, వెంకటరత్నయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు బివి. శ్రీనివాసులు అండ్ బ్రదర్స్ సహకాంతో నిర్వహించిన ఈ శిబిరంలో 298 మంది పేదలకు వివిధ జబ్బులకు చికిత్స చేసి నెలకు సరిపడే మందులను ఉచితంగా ఇచ్చామని తెలిపారు. శిబిరంలో వైద్య నిపుణులు డాక్టర్ వివేక్ కుళ్లాయప్ప, డాక్టర్ వెంకటేశ్వరులు, డాక్టర్ సతీష్ కుమార్, డాక్టర్ జయదీప్, డాక్టర్ వినయ్‌కుమార్ వైద్యసేవలు అందించారు. శిబిరంలో మేకల శివయ్య, బండి ఆంజనేయులు, మామిళ్ల అశ్వత్థనారాయణ, కాచర్ల నారాయణస్వామి, పెద్దకోట్ల భాస్కర్, పెద్దకోట్ల విజయ్, బండి పవన్‌కుమార్, బండి సాయి, బండి మనీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీచౌడేశ్వరీదేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

ట్రూ అప్ ఛార్జీలను ఉపసంహరించాలి

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

ప్రజలపై మోపుతున్న ట్రూ అప్ ఛార్జీల(అదనపు విద్యుత్ ఛార్జీలు) భారాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని అఖిలపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని సిఐటియు కార్యాలయం వద్ద సిపిఎం, కాంగ్రెస్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. వారు మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండా రాష్ట్రంలో ఏకపక్షంగా విద్యుత్ వినియోగదారులపై రూ. 15,441 కోట్ల ట్రూ అప్ ఛార్జీల భారం మోపడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం నిరంకుశ పోకడలకు స్వస్తి చెప్పాలన్నారు. విద్యుత్ భారాలపై కలిసి వచ్చే రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో కలిసి ప్రజలను చైతన్య పరచి ప్రభుత్వం ట్రూ అప్ ఛార్జీలను ఉపసంహ రించుకునేంత వరకూ దశల వారీగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్పొరేట్లకు లాభాలు చేకూర్చేందుకు ఎప్పుడో వాడిన విద్యుత్‌కు ఇప్పుడు అదనంగా డబ్బు చెలించాలనడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకపోగా నిత్యావసర ధరలను నియంత్రించడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే ట్రూ అప్ ఛార్జీలు,

సంతకాల సేకరణ చేపట్టిన అఖిలపక్ష పార్టీల నాయకులు

స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను రద్దు చేయాలని, లేనిచో ప్రజలతో మమేకమై పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు హరి, కాంగ్రెస్ నాయకులు నిస్సార్, సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఫకద్దీన్, సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హర్ష, మహబూబ్‌బాషా, ఆరిఫ్, ఉత్తప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎపీకి డ్రిప్, స్ప్రింక్లర్లు తెచ్చిన ఘనత చంద్రబాబుదే : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

రాష్ట్రానికి డ్రిప్, స్ప్రింక్లర్లను మొట్టమొదట తీసుకొచ్చింది సిఎం చంద్రబాబేనని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. ప్రభుత్వం రాయితీపై మంజూరు చేసిన డ్రిప్పు, స్ప్రింక్లర్లను ఆదివారం చెన్నేకొత్తపల్లిలో కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల రైతులకు ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం డ్రిప్పు, స్ప్రింక్లర్లు సరిగా ఇవ్వకపోవడంతో రైతులు పెద్దఎత్తున పంటలు నష్టపోయారన్నారు. ఐదేళ్ల తర్వాత మళ్లీ రైతు ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్నదాతల కళ్లలో ఆనందం కనిపిస్తోందన్నారు. చెన్నేకొత్తపల్లి మండలంలో 420, కనగానపల్లి-318, రామగిరి-127 మంది రైతులకు పార్టీలకు అతీతంగా అర్హులకు డ్రిప్పు, స్ప్రింక్లర్లు అందిస్తున్నామన్నారు. అనర్హులు తీసుకుంటే కచ్చితంగా చర్యలు ఉంటాయన్నారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబుకు మొదటి నుంచీ అనంతపురం జిల్లా

కార్యక్రమంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

అంటే ప్రత్యేక అభిమానమని, అందుకే మళ్లీ ముఖ్యమంత్రి కాగానే రైతులకు డ్రిప్పు, స్ప్రింక్లర్లు పెద్ద ఎత్తున మంజూరు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎపిఎంఐపి అధికారులు, కంపెనీ ప్రతినిధులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పేద ప్రజలకు వైద్య సేవలు అందించడమే రోటరీ క్లబ్ ముఖ్య కర్తవ్యమని అధ్యక్ష, కార్యదర్శులు జయసింహా, నాగభూషణం, ఉపాధ్యక్షులు నరేందర్‌రెడ్డి, క్యాంపు ఛైర్మన్ రమేష్‌బాబు తెలిపారు. పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరత్నమ్మ, పర్వీన్, సభ్యులు లాయర్ సుమలత మాట్లాడుతూ శిబిరంలో అనంతపురంలోని తిరుమల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు సింధు, లోకనాథ్, దివాకర్, తేజస్విని, కిషోర్, దినేష్, మనోజ్, శివశంకర్, లక్ష్మీపతి, నవ్య, అనిరుద్, ధర్మవరం పట్టణంలోని ఎర్రగుంటలో ఉన్న దేవీ నర్సింగ్ హోం డాక్టర్ పద్మ, తదితర వైద్యులు వంద మందికి పైగా వివిధ జబ్బులకు చికిత్స చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారని తెలిపారు. సహకరించిన హెచ్‌ఎం మేరీ వర కుమారి, పాఠశాల కమిటీకి కృతజ్ఞతలు

వైద్య శిబిరం ఏర్పాటుకు సహకరించిన వారిని సన్మానిస్తున్న రోటరీ, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు

తెలిపారు. స్కూల్ ఇన్‌ఛార్జి హెచ్‌ఎం శారదను సత్కరించారు. శిబిరంలో అనంతపురం నగరపాలక సంస్థ ఈఈ నాగమోహన్, రోటరీ క్లబ్ కోశాధికారి సుదర్శన్ గుప్తా, శివయ్య, పెరుమాల దాస్, డాక్టర్ సత్యనిర్ధారన్, సత్రశాల ప్రసన్నకుమార్, రామకృష్ణ, కొండయ్య, సోలిగాళ్ల వెంకటే శులు, ఇన్నర్ వీల్ క్లబ్ రాజేశ్వరి, సుమలత, భార్గవి, లలిత, లక్ష్మీ పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు మృతికి నివాళి

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని బుళ్లసముద్రం గ్రామ సమీపంలో శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఉపాధ్యాయురాలు సుజాత ఆదివారం మృతి చెందింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను బెంగళూరులోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. దీంతో ఆమె మృతదేహాన్ని పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ఈ విషయం తెలిసిన వెంటనే మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి ఆసుపత్రికి వెళ్లి సుజాత మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

యుటిఎఫ్ నాయకుల సంతాపం

గుడిబండ : ఉపాధ్యాయురాలు సుజాత మృతికి యుటిఎఫ్ నాయకులు సంతాపం తెలిపారు. సుజాత మృతదేహాన్ని బెంగళూరు నుంచి ఆమె స్వగ్రామం కెఎన్.పల్లికి తరలించగా వివిధ రాజకీయ పార్టీలు, యుటిఎఫ్ నాయకులు ఆ గ్రామం వెళ్లి ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో

ఉపాధ్యాయురాలు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఎంఇఓ రవిచంద్రకుమార్, యుటిఎఫ్ నాయకులు బంగారు లింగప్ప, కరియప్ప, యంజేరప్ప, శివానందనాయక్, గోవిందరాజులు, మహంతేష్, హరికృష్ణ, అశోక్‌కుమార్, లక్ష్మీదేవి, నవీన్‌కుమార్, శశిధర్, కృష్ణమూర్తినాయక్, సిఆర్‌పిలు భీమరాజు, బుడెన్, రొళ్ల జడ్పిటిసి అనంతరాజు, కాంతరాజు, గుడిబండ జడ్పిటిసి భూతరాజు, ఇనగలూరు సర్పంచి నటరాజు, అగళి టిడిపి మండల కన్వీనర్ కుమారస్వామి, శివకుమార్, దుర్గేష్, ఎంపిటిసి శశిధర్, సర్పంచులు కరుణాకర్, ఈరన్న, నాయకులు దాసరి రవి, దయానంద పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

ప్రజాశక్తి-కదిరి టౌన్

రూ. వంద చెల్లించి టిడిపి సభ్యత్వం తీసుకుంటే కార్యకర్తలకు భరోసాగా ఉంటుందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్ తెలిపారు. పట్టణంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ టిడిపి సభ్యత్వం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే సభ్యత్వ నమోదుకు ఇక మూడు రోజులే గడువు ఉందని, వెంటనే రూ. వంద చెల్లించి సభ్యత్వం పొందాలని కోరారు.

డైమండ్ ఇర్ఫాన్

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-లేపాక్షి

అల్యూమినియం అసోసియేషన్ ఆఫ్ జవహర్ నవోదయ విద్యాలయ ఆధ్వర్యంలో ఆదివారం 13వ బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. వారు రూ. 10 లక్షలు ఖర్చు చేసి జిఐ షీట్స్‌తో మల్టీ పర్పస్ హాల్ పైకప్పును పునరుద్ధరించారు. దాని శిలా ఫలకాన్ని పూర్వ ప్రిన్సిపల్ బయపరెడ్డి ఆవిష్కరించారు. పూర్వ విద్యార్థులు అప్పటి వారి గురువులను ఘనంగా సత్కరిం చారు. అనంతరం విద్యార్థులు వేసిన పెయింటింగ్స్‌ను ప్రదర్శనకు ఉంచి వాటిని వేలంలో కొనగా వచ్చిన డబ్బును, స్కూల్ నుంచి బయటకు వెళ్లి ప్రొఫెషనల్ కోర్సుల్లో చేరిన పేద విద్యార్థుల స్కాలర్‌షిప్పు కోసం అందజేశారు. పూర్వ విద్యార్థులు 31వ బ్యాచ్ పిల్లలకు స్కాలర్‌షిప్పు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేతగా నిలిచిన లేపాక్షి బాలికల ఫుట్‌బాల్ జట్టు

ఆర్‌డిటి జిల్లాస్థాయి ఫుట్‌బాల్ విజేత లేపాక్షి

ప్రజాశక్తి-లేపాక్షి

ఆర్‌డిటి అనంతపురం స్పోర్ట్స్ విలేజ్‌లో జరిగిన జిల్లా స్థాయి అండర్-12 బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో లేపాక్షి మండల ఫుట్‌బాల్ క్లబ్ విజేతగా నిలిచింది. మూడు నెలలుగా జరుగుతున్న ఈ లీగ్ పోటీల్లో ఫైనల్ రౌండ్‌కు చేరుకొని జిల్లాలోని ఉత్తమ జట్లపై విజయం సాధించి ఛాంపియన్స్‌గా నిలిచారని హెచ్‌ఎం జివి.సుబ్బారావు, ఉపాధ్యాయులు అభినందించారు. విజేత జట్టుకు ఫుట్‌బాల్ కోచ్‌లు బహుమతి ప్రదానం చేసినట్లు పులమతి పాఠశాల పిడి రామాంజనేయులు తెలిపారు. జట్టును మండల ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయుల, నాయకులు అభినందించారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులకు సన్మానం

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని మాధవరాయ ఆలయ ఆవరణలో ఆదివారం భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన మండల అధ్యక్షులు మహబూబ్‌బాషా, ప్రధాన కార్యదర్శి ముద్దల వెంకటరమణ, కోశాధికారు లు బాబ్‌జాన్, మహబూబ్‌ను కమిటీ సభ్యులు సన్మానించారు. వారు మాట్లాడుతూ నిర్మాణరంగం కార్మికులను ఐక్యంగా నడపడంతో పాటు వారి సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అల్లాబకాష్, నరసింహమూర్తి, బాబు, నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేష్, వ్యకాసం జిల్లా కమిటీ సభ్యురాలు స్వర్ణలత పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి-రొద్దం

ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిపై ఆర్.మరవపల్లి వద్ద ఆదివారం ఎస్ఐ ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి హెల్మెట్, రికార్డులు లేని వారికి జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోతే అపరాధ రుసుము చెల్లించక తప్పదన్నారు. తనిఖీల్లో పోలీసులు మారుతి, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ నాగేంద్ర

వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షుడిగా నారాయణ

ప్రజాశక్తి-కొత్తచెరువు

వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షునిగా కొత్తచెరువుకు చెందిన ఎం.నారాయణ నియమితులయ్యారు. ఈయన పార్టీ కోసం చేసిన సేవలను గుర్తించి ఈ పదవికి ఎంపిక చేశారు. తనకు పదవి దక్కడానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే దుద్దుగుంట శ్రీధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, మండల నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీని బలోపేతం చేస్తానని తెలిపారు. నారాయణను నాయకులు సూరి, శ్యాంసుందర్‌రెడ్డి, వాల్మీకి శంకర్, వెంకటరాముడు, రామాంజనేయులు, పూజారి పెద్దన్న సన్మానించి అభినందనలు తెలిపారు.


నారాయణను సన్మానిస్తున్న వైసిపి నాయకులు

డీఎస్సీ శిక్షణార్థులు ఉద్యోగం సాధించాలి

ప్రజాశక్తి-పెనుకొండ

డీఎస్సీ కోచింగ్ తీసుకున్న అభ్యర్థులు ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలని ఎబిసిడబ్ల్యు గంగాధర్ ఆకాంక్షించారు. పట్టణంలో ఆదివారం డీఎస్సీ ఉచిత కోచింగ్ ముగింపు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ నియమకాల్లో భాగంగా ఉచిత డీఎస్సీ కోచింగ్ నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. అభ్యర్థులు కష్టపడి చదివి మంచి మార్కులతో ఉద్యోగం సాధించాలని ఆకాంక్షించారు. కోచింగ్ సెంటర్‌లో మంత్రి సవిత అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ శ్రీరాములు యాదవ్, మండల కన్వీనర్ సిద్దయ్య, మహిళా నాయకురాలు అనసూయమ్మ, రమణమ్మ, శిక్షణ అభ్యర్థులు పాల్గొన్నారు.

28న శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని తేరుబజార్‌లోని శ్రీవాసవీ కళ్యాణ మండపం(కొత్త సత్రం)లో ఈ నెల 28వ తేదీ గోవింద మాలధారణ సేవా కమిటీ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు కమిటీ గురుస్వామి గౌరవాధ్యక్షులు దేవతా కృష్ణమూర్తి తెలిపారు.

నేరాలు ఘోరాలు

హత్యాయత్నం కేసు నమోదు

ప్రజాశక్తి-కదిరిటౌన్

పట్టణంలోని అడపాల వీధిలో నివాసం ఉంటున్న సాకే మంజుల ఫిర్యాదు మేరకు ఆమె భర్తపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. సిఐ తెలిపిన వివరాలు.. కదిరి పట్టణానికి చెందిన మంజుల ఐదున్నరేళ్ల క్రితం ముదిగుబ్బ మండలంలోని ఎనుములవారిపల్లికి చెందిన నాగేష్ వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. అయితే దంపతుల మధ్య మనస్పర్థల కారణంగా రెండేళ్ల నుంచి విడివిడిగా ఉన్నారు. మంజులకు ఇటీవల భర్తకు ఫోన్ చేయగా అతను కలిసి మాట్లాడదామని చెప్పారు. దీంతో ఆమె శనివారం రాత్రి 7:30 గంటల సమయంలో కదిరి పట్టణం లోని నారాయణమ్మ కాలనీ బ్రిడ్జి వద్దకు వెళ్లగా అక్కడికి చేరుకున్న నగేష్ పథకం ప్రకారం ఆమెను చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి వెంట తెచ్చుకున్న ఛార్జర్ వైరుతో గొంతుకు బిగించడంతో స్పృహ తప్పి పడిపోయింది. దీంతో అతడు అక్కడి నుంచి పారిపోయాడు. కొంతసేపటి తర్వాత ఆమెకు స్పృహ రాగా లేచి ఆటోలో వెళ్లి కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందింది. ఆదివారం బాధితురాలు మంజుల ఫిర్యాదు మేరకు కదిరి పట్టణ పోలీసులు ఆమె భర్త నాగేష్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

పేకాట జూదరులు అరెస్టు.. రూ. 1.51 లక్షలు స్వాధీనం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని కర్నాటక నాగేపల్లి కొండ ప్రాంతంలోని శివారులో పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు ఆదివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. రూరల్ సిఐ సురేష్, పుట్టపర్తి రూరల్, బుక్కపట్నం ఎస్ఐలు లింగన్న, కృష్ణమూర్తి డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా పెట్టి పేకాట స్థావరాలపై ఆపరేషన్ చేపట్టారు. పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్టు చేయడంతో పాటు రూ,1,51,500,నగదు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు.

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-బుక్కపట్నం

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం జగదీష్, పిడి నాగరాజు తెలిపారు. జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పదో తరగతి విద్యార్థులు గణేష్‌రెడ్డి, మంజునాథ్, 9వ తరగతి విద్యార్థి మోహన్‌కుమార్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. వీరు ఈ నెల 23వ తేదీ నుంచి విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం, పిడి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఎర్రమంచి సర్పంచి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి- పెనుకొండ

పెనుకొండ మండలం ఎర్రమంచి గ్రామ సర్పంచి నాగమూర్తి టిడిపిలో చేరారు. ఈ మేరకు ఆయన మంత్రి సవిత ఆధ్వర్యంలో ఎర్రమంచికి చెందిన 10 కుటుంబాలతో కలసి ఆదివారం టిడిపిలోకి చేరారు. వీరికి మంత్రి పార్టీ కండువా కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు.

పాత్రికేయుడి కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-హిందూపురం

అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన సీనియర్ పాత్రికేయులు మల్లికార్జున ప్రసాద్ కుటుంబానికి పాంచజన్య శ్రీనివాసులు, నందకుమార్ ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు వారు పాత్రికేయులకు రూ.5వేలను పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అందించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు రామాంజినేయులు, ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ షబ్బీర్, రమేష్, దాసప్ప తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని కంచిసముద్రం గ్రామంలో వెలసిన బయలు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద అయ్యప్ప స్వామి నూతన ఆలయ నిర్మాణం చేపట్టారు. దీంతో లేపాక్షి గ్రామానికి చెందిన మహబూబ్ సాబ్ అయ్యప్ప మాలధారులకు అన్నదానం ఏర్పాటు చేసి మతసామరస్యం చాటుకున్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేస్తున్న మహబూబ్‌బాషా

డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు పట్టణ శివారు ప్రాంతాలతో పాటు మండలంలో నిర్మానుష్య ప్రదేశాల్లో పోలీసులు డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా చేపట్టారు. బహిరంగంగా మద్యం తాగడం, గ్యాంబ్లింగ్, అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, గంజాయి, తదితర వాటిపై డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ క్రమంలో ఆదివారం పుట్టపర్తి అటవీ సమీప ప్రాంతాలైన అమ్మకొండ పాలెం, వెంగళమ్మచెరువు పరిసరాలు, నిర్మానుష్య ప్రాంతాలతో పాటుగా ఆయా పరిసర ప్రదేశాలు, తోటల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం తాగడం, గంజాయి, పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాలు, ఇతర నేరాలు జరగకుండా డ్రోన్ కెమెరాలతో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని జిల్లేడుగుంట ఆంజనేయస్వామి, భక్తరహళ్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవా లకు ఆంధ్రతో పాటు కర్నాటక నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారికి మొక్కు చెల్లించు కుని భక్తి శ్రద్ధలతో హుండీలో కానుకలు చెల్లిస్తారు. ఈ ఆలయాలకు ఆదాయం రూ. లక్షల్లో ఉన్నా బ్రహ్మోత్సవాల్లో భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇకనైనా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మురళిబాబు డిమాండ్ చేశారు.

వధాన్య జన సొసైటీ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి-కొత్తచెరువు

కొత్తచెరువులోని ఏడు పరీక్ష కేంద్రాల్లో ఆదివారం వధాన్య జన సొసైటీ ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి 1 గంట వరకూ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశామని వధాన్య జన సొసైటీ అధ్యక్షులు పడపాటి అశోక్ తెలిపారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణ సమీపంలోని నాగలూరు వద్ద ఉన్న రూపారాజా పిసిఎంఆర్ పాఠశాలలో గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించి గణిత నమూనాలు చూపరులను ఆకట్టుకున్నాయి. పాఠశాల ఛైర్మన్ హర్షవర్ధన్ మాట్లాడుతూ 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన గణిత మేధావుల్లో ఒకరిగా నిలిచిన శ్రీనివాస రామానుజన్ గణిత శాస్త్రంలో చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయన పుట్టినరోజు డిసెంబర్ 22ను జాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించిందన్నారు. విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకొని క్రమశిక్షణతో చదివి గణితంలో పట్టు సాధించాలన్నారు. అప్పుడే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ రూపారాజాకృష్ణ, జగదీష్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్ నరేష్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో గణిత నమూనాలు ప్రదర్శించిన విద్యార్థులు